**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**శ్రీయుత నారా చంద్రబాబు నాయుడు గారికి,** **తేదీ : 09.11.2015**
గౌరవ ముఖ్యమంత్రి, **విజయవాడ**
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వము,
హైదరాబాదు.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– ఆర్.లక్ష్మయ్య,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయము : కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్వాసితుల లబ్ధి దారుల జాబితా పునఃపరిశీలించి అనర్హులను తొలగించి సాగులో ఉన్న రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ ...**

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం సోలార్ ప్లాంట్ నిర్వాసితులకు నష్ట పరిహారం అందజేయడానికి లబ్ధిదారుల జాబితా తయారీలో రెవెన్యూ యంత్రాంగం అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. పేదల భూములైతే ఆధారాలు లేవని, సాగు భూములను కూడా బీడు భూములని సాకులు చూపిస్తూ నష్ట పరిహారం ఇవ్వమంటున్నారు. చట్ట వ్యతిరేకంగా భూములను అనుభవిస్తున్న కోటీశ్వరులను మాత్రం లబ్ధి దారుల జాబితాలో చేరుస్తున్నారు. మీరు జోక్యం చేసుకుని అవకతవకలను సరిదిద్దే చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

ఓర్వకల్లు మండలం "శకునాల" గ్రామం, గడివేముల మండలంలోని "గని" గ్రామాలలో ప్రభుత్వం సుమారు 5వేల ఎకరాలు సోలార్ విద్యుత్ ప్లాంట్ కోసం భూములను తీసుకుంటున్నది. ఇందులో అత్యధిక భూమి ప్రభుత్వానిది. ఈ భూములలో దళితులు,వెనుక బడిన వర్గాల వారు అనేక సంవత్సరాలనుండి సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి పట్టాలివ్వాలని ఎన్ని ఆందోళనలు చేసినా అధికారులు పట్టించుకోలేదు. కనీసం సాగుదార్లుగా కూడా అడంగల్‌లో పేర్లు నమోదు చేయలేదు. దీని వల్ల నష్ట పరిహారం పొందడానికి ఏ ఆధారం లేకుండా పోయిందని రైతులు ఆందోళన పడుతున్నారు. గని గ్రామంలో సుమారు 1600 ఎకరాలు పేదలు పట్టాలు పొంది 1940 నుండి సాగు చేసుకుంటున్నారు. ప్రతి సంవత్సరం పంటలు పండే ఈ భూమికి నష్ట పరిహారం అడిగితే రెవెన్యూ అధికారులు బీడు భూములని నోటీసులు జారీ చేస్తున్నారు.

మరొక వైపు శకునాల గ్రామంలో కె.ఇ. కుటుంబం పేర్లతో, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ పేరుతో, గ్రామానికి చెందని వారు, ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాముల పేర్లతో వందల ఎకరాల భూమి నమోదయి, లబ్ధి దారుల జాబితాలో ఉన్నాయి. 5ఎకరాలకు మించి భూమి ఉన్న వారు ప్రభుత్వ భూమి అనుభవించడానికి, క్రయ విక్రయాలు చేయడానికి హక్కు లేదన్న అధికారులు వీరందరి చేతుల్లో ఇంత ప్రభుత్వ భూమి ఉన్నా ఎందుకని పట్టించుకోవడంలేదు.

రెవెన్యూ యంత్రాంగం కొందరు రాజకీయ నాయకుల కనుసన్నల్లో పనిచేస్తూ పేదల నోట్లో మట్టి కొట్టి, కోటీశ్వరులకు వడ్డించిన విస్తరి చేస్తున్నది. ఇది అన్యాయం. ఇప్పుడైనా దాన్ని విచారించాలి. శకునాల, గని గ్రామాల్లో అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుని, అనర్హుల పేర్లను నష్ట పరిహారం జాబితానుండి తొలగించి సాగు చేస్తున్న ప్రతి రైతుకు నష్ట పరిహారం అందించాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటి కోరుతున్నది. ఆత్మహత్య చేసుకున్న యువరైతు మద్దిలేటి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతున్నాము.

అలాగే ఈ రెండు గ్రామాల్లో రైతుల పట్టా భూములకు సైతం నష్ట పరిహారం చెల్లించకుండానే ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టడం అక్రమం. నష్ట పరిహారం చెల్లించిన అనంతరమే నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతున్నాను.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి